సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 13 । డిసెంబర్ । 2024



టన్ను చీనీ రూ.27 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.27 వేలు, కనిష్టంగా రూ.10 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.14

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.14, కనిష్టంగా రూ.7, సరాసరిన రూ.10 ప్రకారం ధర పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం
30.7°/17.4°

జిల్లా పరిధిలో గురువారం తుపాను వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. చలి వాతావరణం నెలకొంది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

జిల్లా వ్యాప్తంగా తుంపర వర్షం



పుట్టపర్తి మండలం బడేనాయిక్ తండా వద్ద వరి కుప్పలకు ప్లాస్టిక్ కవర్లు కప్పిన దృశ్యం

పుట్టపర్తి అర్బన్: ఫంగల్ తుపాను వెళ్లి నాలుగు రోజులు తిరగకనే మరోసారి జిల్లాలో తుపాను ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వరి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో గురువారం తుంపర వాన కురిసింది. ఆకాశం మేఘావృతం కావడంతో వరి కుప్పలపై ప్లాస్టిక్ కవర్లు కప్పి ఉంచారు. ఈ తుపాను ఎన్ని రోజులు ఉంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. గురువారం తెల్లవారు జాము నుంచే వర్షం కురిసింది. రబీ సీజన్‌లో సాగైన పంటల్లో కలుపు తీసే పనులు, వ్యాధులకు మందులు పిచికారీ చేసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. వర్షం వల్ల ఆ పనులకూ విఘాతం కలిగింది.

కొండచిలువ పట్టివేత



కొండ చిలువను పట్టుకుంటున్న రైతు కూలీలు

పెనుకొండ: మండలంలోని కోనాపురం గ్రామ వరి పొలాల్లో గురువారం ఉదయం ఓ భారీ కొండచిలువ రైతులు బంధించారు. రైతు బాబయ్య తన పొలంలో గురువారం ఉదయం కూలీలతో కలసి వరికోతలు చేపట్టాడు. ఆ సమయంలో కనిపించిన భారీ కొండచిలువను రైతు కూలీలు చాకచక్యంగా పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలేశారు.

పరాకాష్టకు ప్రచార పిచ్చి



విజయవాడ వెళుతున్న బస్సును ప్రారంభిస్తున్న ఆర్టీఓ వీఎస్ శర్మ

కదిరి అర్బన్: ప్రచార పిచ్చి పరాకాష్టకు చేరడమంటే ఇదే... విజయవాడలో స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్–2047ను శుక్రవారం ముఖ్యమంత్రి విడుదల చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు ప్రభుత్వ నిధులతో గురువారం జిల్లా వాసులను ఆర్టీసీ బస్సుల ద్వారా పంపడం గమనార్హం. ఇక్కడి నుంచి వెళ్లిన వారికి వసతి, తదితర ఏర్పాట్ల కోసం ప్రత్యేకంగా అధికారులను నియమించారు. కదిరిలో 45 మంది రైతులకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయగా ఆర్టీఓ వీఎస్ శర్మ, ఏడీఏ సత్యనారాయణ బస్సుకు జెండా ఊపి ప్రారంభించారు. ఇక ఈ తతంగం చూసిన వారు... ఎక్కడో విజయవాడలో జరుగుతున్న కార్యక్రమానికి ప్రభుత్వ నిధులు వెచ్చించి ఇంత మందిని పంపించడం ఏమిటి? ఇంత ప్రచారం అవసరమా.? అంటూ చర్చించుకున్నారు.

● హిమోదయం



చిలమత్తూరు: పొలాలపై పొగ మంచు ఇలా..

జిల్లాలోని పలు ప్రాంతాల్లో చలి తీవ్రత పెరిగింది. మంచు ప్రభావం కూడా తీవ్రంగా ఉంటోంది. ఉదయం 9 గంటలైనా మంచు తీవ్రంగా ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. అయితే మంచు అందాలు మాత్రం చూపరులను కట్టిపడేస్తున్నాయి. – చిలమత్తూరు:



పొగమంచు కారణంగా ఉదయం పూట కూడా లైట్లు వేసుకొని వెళ్తున్న వాహనదారులు

సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను నమ్మించి అధికారం చేపట్టిన చంద్రబాబు ఆర్నెల్లయినా వాటి అమలు దిశగా ఆలోచించడం లేదు. మరీ ముఖ్యంగా రైతు సమస్యలను అసలు పట్టించుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం కళ్లు తెరిపించేందుకు వైఎస్సార్‌సీపీ సన్నద్ధమైంది. ఇందులో భాగంగా నేడు జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో భారీ ర్యాలీ నిర్వహించనుంది.



దగా పడిన రైతుకు దన్నుగా..

నేడు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రైతు పోరుబాట

- అన్నదాతలకు అండగా 'పుట్టపర్తి'లో భారీ ర్యాలీ
- హామీలు నెరవేర్చడంలో చంద్రబాబు సర్కారు ఘోరంగా విఫలం
- అన్ని వర్గాల్లోనూ పెల్లుబుకుతున్న అసంతృప్తి

సాక్షి, పుట్టపర్తి: రాష్ట్రంలోనే వ్యవసాయ ఆధారిత జిల్లాగా ఉమ్మడి అనంతపురం జిల్లాకు పేరుంది. ఇక్కడ ఉద్యాన పంటలు ఎక్కువగా ఉన్నాయి. మెట్ట పొలాలు కూడా అధికం. పప్పుశనగ, వేరుశనగ, కంది, ఆముదం తదితర పంటలు విరివిగా పండిస్తారు. అయితే, ఈ ఏడాది సరిగా వర్షాలు కురవక పోవడం, పంటలు చేతికందే సమయంలో తుపాన్లు వెరసి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇలాంటి సమయంలో అన్నదాతలను ఆదుకోవాల్సిన సర్కారు ఆ విషయాన్ని గాలికొదిలేసింది. ఒక్కో రైతుకు రూ.20 వేలు ఇస్తానని ఎన్నికల ముందు వాగ్దానం చేసిన చంద్రబాబు ముఖం చాటేశారు. ఇప్పుడు గిట్టుబాటు ధరలు కూడా లేవు. దీంతో రైతన్నలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ పోరు బాట..

రైతులను పట్టించుకోని కూటమి ప్రభుత్వం కళ్లు తెరిపించేలా వైఎస్సార్‌సీపీ పోరుబాట పట్టింది. ఇందులో భాగంగానే శుక్రవారం జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో భారీ ర్యాలీకి సిద్ధమైంది. ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభం కానుంది. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు.

అన్ని వర్గాలకూ మోసం

రైతులనే కాదు అన్ని వర్గాలనూ చంద్రబాబు సర్కారు మోసం చేసింది.

- 18 ఏళ్లు నిండిన ఒక్కో మహిళకు నెలకు రూ.1,500 ఇస్తానని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. పథకం అమలు కోసం ప్రస్తుతం జిల్లాలో రూ.6.99 లక్షల మంది ఎదురుచూస్తున్నారు.
- 'తల్లికి వందనం' పథకం కింద 2.23 లక్షల మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15,000 ఇస్తామన్నారు. నేటికీ ఏ ఒక్కరికీ పైసా అందించలేదు.
- ఉచితంగా మూడు సిలిండర్లు అన్నారు. జిల్లాలో మొత్తం 8.08 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీరిలో చాలా మందికి ఇప్పటివరకూ ఉచిత సిలిండర్ అందలేదు.
- మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమంటూ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక దీపావళి అన్నారు.. దసరా అన్నారు.. అన్నీ పోయాయి. నేడు కూటమి ప్రజాప్రతినిధులు ఆ ఊసే ఎత్తుడం లేదు.
- నిరుద్యోగులకు భృతి ఇస్తామన్నారు. కానీ, ఇప్పటివరకూ ఉద్యోగాలు రాలేదు.. భృతి ఇవ్వలేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో వివిధ కోర్సులు చదివిన 8 లక్షల మంది యువత భృతి కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో రైతు భరోసా కింద ఇచ్చిన ఆర్థిక సాయం..

సంవత్సరం	రైతులు	ఆర్థిక సాయం (రూ.కోట్లలో)
2019-20	256170	345.83
2020-21	278337	375.75
2021-22	270443	359.80
2022-23	268947	364.24
2023-24	279556	321.47



దళారులకు వరి ధాన్యం విక్రయిస్తున్న రైతులు

గ్రామ స్వరాజ్యానికి తూట్లు..

అధికారంలోకి వస్తే వలంటీర్లకు నెలకు రూ.10 వేలు ఇస్తామని చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్కరికి ఉద్యోగం కూడా లేకుండా చేశారు. అంతేకాదు సచివాలయ ఉద్యోగులను కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు వేధిస్తున్నారు. రానున్న రోజుల్లో సచివాలయ వ్యవస్థను పూర్తిగా తీసేస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది.

మహిళలకు రక్షణ కరువు..

ప్రశాంతతకు మారుపేరుగా నిలిచిన శ్రీసత్యసాయి జిల్లాలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళలు, చిన్నారులకు రక్షణ కరువైంది. హిందూపురం నియోజకవర్గంలో గ్యాంగ్‌రేప్, చిన్నారిపై అత్యాచారం.. ఆపై హత్య, పుట్టపర్తి మండలం బత్తలపల్లిలో పదేళ్ల బాలికపై అత్యాచారయత్నం, మడకశిరలో బాలిక కిడ్నాప్ కలకలం రేపాయి. ఇలా ప్రతి నియోజకవర్గంలో ఏదో రూపంలో అఘాయిత్యాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి.

వైఎస్సార్‌సీపీ నేతల వేధింపులు, అరెస్టులు..

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోంది. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు, నాయకులే లక్ష్యంగా అక్రమ కేసులు బనాయించడం, స్టేషన్‌కు పిలిపించడం, దారికాచి చితకబాదడం పరిపాటిగా మారింది. ఉద్యోగులు కూడా చెప్పినట్లు వినాలని వేధిస్తున్నారు. ప్రభుత్వ పథకాలు అందాల్సి ఉన్నా.. పింఛన్ సౌకర్యం కూడా లేకుండా చాలామందిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

సాయం చేయకపోగా కేసులా?



కూటమి నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా అక్రమ అరెస్టులు, కేసులు బనాయిస్తుండటం సరికాదు. ప్రజాస్వామ్యం మరిచి రెడ్‌బుక్ అమలు చేస్తుండటం బాధాకరం చంద్రబాబు ఒక్కసారి కూడా ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన దాఖలాలు లేవు.

– బాబాజాన్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు

నిరుద్యోగులకు మరో 'సారీ'



ఇంటికో ఉద్యోగం అన్నారు. లేదంటే నిరుద్యోగ భృతి అన్నారు. జాబు రావాలంటే బాబు రావాలని ప్రచారం చేశారు.అధికారంలోకి వచ్చాక ప్రతిసారీ నిరుద్యోగులను చంద్రబాబు మోసం చేస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనగా ఉన్నారు.

– చంద్రశేఖర్‌రెడ్డి, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

రైతును నిలువునా ముంచారు



చంద్రబాబు అధికారం చేపట్టాక సర్కారు నుంచి రైతులకు ఎలాంటి లబ్ధి చేకూరలేదు. పెట్టుబడి సాయం అందక.. అతివృష్టి. అనావృష్టి కారణంగా పెట్టిన పంట చేతికందక రైతులు భారీగా నష్టపోయారు. రైతును నిండా ముంచిన ప్రభుత్వం ఇది. ప్రభుత్వంపై పోరుబాట తప్పదు.

– దాసిరెడ్డి, బీడుపల్లి, పుట్టపర్తి మున్సిపాలిటీ

బాబు హామీలు.. నీటి మీద రాతలే



ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ నీటి మీద రాతలే. మాయ మాటలు చెప్పి.. అధికారం చేపట్టడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. గడచిన ఆర్నెల్లలో జిల్లాలో శాంతి భద్రతలు కరువయ్యాయి. మహిళలకు రక్షణ లేకుండా పోయింది. ప్రభుత్వ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్నారు. అన్నదాతలకు చేసిందేమీ లేదనే ఉద్దేశంతో ప్రభుత్వంపై పోరుబాట కార్యక్రమం చేపట్టాం. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్‌ల ముట్టడి తలపెట్టాం.

– ఉషశ్రీచరణ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు

ఏం కష్టం వచ్చింది 'తల్లీ'..

- ఇద్దరు బిడ్డలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం
- తల్లి, కుమారుడు మృతి
- ఆస్పత్రిలో చావుబతుకుల నడుమ కొట్టుమిట్టాడుతున్న కుమార్తె





మృతి చెందిన సుజాత, చైతన్య, చికిత్స పొందుతున్న రాహిత్య

గార్లదిన్నె: కుటుంబ కలహాలతో ఓ మహిళ తనువు చాలించాలనుకుంది. తను వెళ్లిపోతే బిడ్డల పరిస్థితి ఏమిటని తీవ్రంగా ఆలోచించింది. చివరకు కుమార్తె, కుమారుడినీ తనవెంటే తీసుకువెళ్లాలని నిర్ణయించుకుంది. పిల్లలకు బలవంతంగా విషపు గుళికల నీరు తాగించి, తనూ తాగింది. ఈ ఘటనలో తల్లి, కుమారుడు మృతి చెందగా.. కుమార్తె ఆస్పత్రిలో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. ఈ ఘటన గురువారం గార్లదిన్నెలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. గార్లదిన్నె మండలంలోని యర్రగుంట్లకు చెందిన సురేష్‌కు శ్రీసత్యసాయి జిల్లా నల్లచెరువు మండలానికి చెందిన లక్ష్మీదేవి, వెంకటయ్య దంపతుల కుమార్తె సుజాత (38)కు 20 ఏళ్ల క్రితం వివాహమైంది.వీరికి కుమార్తె రాహిత్య, కుమారుడు నాగ చైతన్య (11)సంతానం. రాహిత్య ప్రస్తుతం చెన్నై సత్యభామ కాలేజీలో బీటెక్ ప్రథమ సంవత్సరం, నాగ చైతన్య గార్లదిన్నెలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నారు. సురేష్, సుజాత దంపతులు మూడేళ్ల నుంచి గార్లదిన్నెలో అద్దె భవనంలో నివాసం ఉంటూ కిరాణా షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల కుటుంబ కలహాలు తలెత్తగా సుజాత జీవితంపై విరక్తి చెందింది.

తనతో పాటు పిల్లలనూ తీసుకువెళ్లాలని..

గురువారం ఉదయం భర్త సురేష్ గార్లదిన్నె నుంచి యర్రగుంట్లలోని వ్యవసాయ తోట వద్దకు వెళ్లగా... సుజాత గార్లదిన్నెలోని ఓ ఫర్టిలైజర్ షాపులో విషపుగుళికలు కొనుగోలు చేసి ఇంటికి తీసుకువెళ్లింది. అనంతరం తలుపులు వేసుకొని మొదట కుమార్తె రాహిత్య, కుమారుడు నాగ చైతన్యకు విషపు గుళికలు నీళ్లలో కలిపి తాపించే ప్రయత్నం చేసింది. పిల్లలు వద్దన్నా వినకుండా బలవంతంగా విషపుగుళికలు కలిపిన నీళ్లు తాగించింది. అనంతరం ఆమెకూడా తాగి అపస్మారక స్థితిలో పడిపోయింది. దీంతో కుమార్తె రాహిత్య బయటకు వచ్చి జరిగిన విషయాన్ని ఇరుగుపొరుగుకు తెలిపింది. వెంటనే వారు సుజాత, రాహిత్య, చైతన్యలను కారులో అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సుజాత మృతి చెందింది. కుమారుడు చైతన్య, కుమార్తె రాహిత్యకు మెరుగైన వైద్యం అందించేందుకు బెంగళూరుకు తరలిస్తుండగా.. మార్గమధ్యంలోనే సుజాత కుమారుడు నాగ చైతన్య మృతి చెందాడు. ప్రస్తుతం రాహిత్య బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. సుజాత, నాగచైతన్య మృతదేహాలను అనంతపురంలోని సర్వజనాస్పత్రి మార్చురీలో ఉంచారు.



కుమార్తె, కుమారుడితో సుజాత దంపతులు

మిన్నంటిన రోదనలు

సమాచారం తెలుసుకున్న సుజాత కుటుంబ సభ్యులు పెద్దసంఖ్యలో సర్వజనాస్పత్రికి చేరుకున్నారు. విగతజీవులుగా ఉన్న సుజాత, చైతన్యలను చూసి బోరున విలపించారు. ఏ కష్టంవచ్చిందని ఇంతపని చేశావు తల్లీ అంటూ వారు రోదించిన తీరు చూసి అక్కడున్న వారంతా కన్నీరు పెట్టుకున్నారు.

భర్తపై కేసు నమోదు

సుజాతను భర్త సురేష్ నిత్యం వేధిస్తుండేవాడని, చిన్న, చిన్న విషయాలకే ఘర్షణ పడి నెల రోజులైనా భార్యతో మాట్లాడేవాడు కాదని బంధువులు తెలిపారు. సురేష్ పెట్టిన మానసిక వేధింపులతోనే సుజాత పిల్లలతో కలిసి చనిపోవాలనుకుందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సుజాత, ఆమె కుమారుడు చైతన్య మృతికి భర్త సురేష్ కారణమని తెలిపారు. దీంతో సురేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు.


సాగునీటి సమరానికి సిద్ధం

- జిల్లాలోని 230 సాగునీటి సంఘాలకు ఎన్నికలు రేపు
- ఎన్నికల నిర్వహణకు అధికారుల ఏర్పాట్లు

పుట్టపర్తి అర్బన్: సాగునీటి సంఘాల ఎన్నికలను శనివారం జరగనున్నాయి. ఇందులో భాగంగానే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కూడా చర్యలు చేపట్టారు. సుమారు పదేళ్ల తర్వాత ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఓటర్ల జాబితాలను ప్రదర్శించారు. ఒక్కో సాగునీటి సంఘానికి ఆరుగురు చొప్పున ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులను తొలుత ఎన్నుకుంటారు. తొలుత ఏకాభిప్రాయంతో ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులను ఎన్నుకోవడానికి ప్రయత్నం చేస్తారు. ఏకాభిప్రాయం కుదరకపోతే ఎన్నికలు నిర్వహిస్తారు. ఓటర్లతో చేతులెత్తే పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తారు. ఆ తర్వాత ప్రాదేశిక నియోజకవర్గాలకు సభ్యులుగా ఎన్నికైన వారు నీటి సంఘాల ఛైర్మన్లను ఎన్నుకుంటారు. ఆ రోజు ఉదయం 8 గంటలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుంది. సాయంత్రం 5 గంటలకు ఎన్నికల ప్రక్రియ ముగుస్తుంది.

జిల్లాలో 230 సాగునీటి సంఘాలు..

జిల్లాలో మైనర్, మీడియం సాగునీటి సంఘాలు 230 ఉన్నాయి. జిల్లాలో ధర్మవరం, పెనుకొండ, పుట్టపర్తి, కదిరి నాలుగు రెవెన్యూ డివిజన్‌లు ఉన్నాయి. ఇందులో అత్యధికంగా పెనుకొండ రెవెన్యూ డివిజన్‌లో 135 సాగునీటి సంఘాలు, ధర్మవరంలో 35, పుట్టపర్తిలో 26, కదిరిలో 18 కలిపి 214 ఉన్నాయి. మీడియం సాగునీటి సంఘాల్లో పెనుకొండ డివిజన్‌లో పెన్నా కుముద్వతీ ప్రాజెక్టు కింద 5 సంఘాలు, ధర్మవరం డివిజన్‌లో అప్పర్ పెన్నార్ ప్రాజెక్టు కింద 5, యోగి వేమన రిజర్వాయర్ ప్రాజెక్టు కింద 6 కలిపి 16 సాగునీటి సంఘాలు ఉన్నాయి. సాగునీటి సంఘాల ఎన్నికలను కలెక్టర్ చేతన్, జలవనరులశాఖ ఈఈ రాధాకృష్ణ పర్యవేక్షించనున్నారు. ఓటర్లు ఓటరు కార్డు, ఆధార్, పట్టాదార్ పాసు పుస్తకం, ఇతర ఏ గుర్తింపు కార్డుతో నైనా ఓటు వేసే అవకాశం ఉంటుంది.



వెంగళమ్మ చెరువు

జిల్లాలో సాగునీటి సంఘాల సంఖ్య	: 230
ఓటర్ల సంఖ్య	: 77,454
ఆయకట్టు	: 87,308 ఎకరాలు

కనులపండువగా శోభాయాత్ర




విశేష అలంకరణలో నెట్టికంటి ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహం, శోభాయాత్రలో మాలధారుల ఆనందోత్సాహం

గుంతకల్లు: పట్టణ పురవీధుల్లో గురువారం హనుమాన్ శోభాయాత్ర కనులపండువగా సాగింది. 40 రోజులుగా దీక్షలో ఉన్న స్వాములు ముందుగా మండల పరిధిలోని ఎస్.తిమ్మాపురం గ్రామ సమీపంలోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద భక్తి శ్రద్ధలతో ఇరుముడి ధరించారు. అనంతరం ర్యాలీగా పట్టణంలోని బళ్లారి గేట్ సమీపంలోని అభయాంజనేయస్వామి విగ్రహం వద్దకు చేరుకున్నారు. నెట్టికంటి ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాన్ని రథంపై కొలువుదీర్చారు. బెంగళూరు నుంచి తెప్పించిన వివిధ రకాల పుష్పాలతో రథాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. కేరళ వాయిద్య కళాకారులు, నంద్యాల జిల్లా వెలుగోడుకు చెందిన కళాకారుల కోలాటం మధ్య శోభాయాత్ర సాగింది. బీరప్పగుడి సర్కిల్, ప్రధాన రహదారి, సత్యనారాయణపేట మీదుగా కసాపురం వరకు సాగిన ఉత్సవంలో జై శ్రీరామ్, జై నెట్టికంటి ఆంజనేయస్వామి నామస్మరణలు మార్మోగాయి. ఆలయ ప్రాంగణంలో మాలధారులు ఇరుముడి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వాణి, కమిటీ ఛైర్మన్ కె.సుగుణమ్మ పాల్గొన్నారు.

- నెట్టికంటి ఆంజనేయస్వామి వారి ఆలయంలో శుక్రవారం అత్యంత వైభవంగా హనుమద్ వ్రతం జరగనుంది.

కొత్తచెరువులో కాంట్రాక్టర్ దారుణహత్య

- ఇనుప రాడ్లతో కొట్టి చంపిన హంతకులు

పుట్టపర్తి టౌన్: కొత్తచెరువు మండలం మైలేపల్లిచెరువు కట్ట సమీపంలో నల్లమాడ మండలం బొగ్గులపల్లి గ్రామానికి చెందిన విద్యుత్ కాంట్రాక్టర్ గాండ్ల రాజశేఖర్ (49) బుధవారం అర్ధరాత్రి దారుణ హత్యకు గురయ్యారు. కొత్తచెరువు సీఐ ఇందిర వివరాల మేరకు... నల్లమాడ మండలం బొగ్గులపల్లి గ్రామానికి చెందిన రాజశేఖర్ (49) రెండు సంవత్సరాలుగా కొత్తచెరువు మండలంలో విద్యుత్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నారు. మండల వ్యాప్తంగా విద్యుత్ పరికరాల మరమ్మతులు చేపడుతున్నారు. విద్యుత్ సామగ్రి, వాహనాలు ఉంచేందుకు కొత్తచెరువు సమీపంలో మైలేపల్లి చెరువు కట్ట వద్ద ఓ పొలంలో ఉన్న ఫాంహౌస్‌లో ఇల్లు అద్దెకు తీసుకున్నారు. అక్కడ రాజశేఖర్‌తో పాటు మరో ఇద్దరు నివాసం ఉంటున్నారు. అయితే బుధవారం అర్ధరాత్రి సమయంలో 10 మంది దుండగులు వాహనంలో వచ్చి రాజశేఖర్ ఉంటున్న ఇంటి తలుపుతట్టారు. తలుపుతీయగా మిగతా ఇద్దరిని వదిలేసి రాజశేఖర్‌ను వాహనంలో ఎక్కించుకొని వెళ్లిపోయారు.



రాజశేఖర్ (ఫైల్)

వెంటనే వారు డయల్ 100కు ఫోన్ చేశారు. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే హంతకులు విద్యుత్ కాంట్రాక్టర్ రాజశేఖర్‌ను ఇనుప రాడ్లతో కొట్టి దారుణంగా హత్య చేసి ఫాంహౌస్ వద్ద పడేసి వెళ్లిపోయారు. పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతునికి భార్యతో పాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు. అయితే మృతుడు రాజశేఖర్ సోమందేపల్లిలో ఓ మహిళతో అక్రమ సంబంధం కొనసాగిస్తున్నారని గతంలో పలుమార్లు ఆమెకు సంబంధించిన వారు హెచ్చరించినా మార్పు రాకపోవడంతో ఆమెకు సంబంధించినవారే హత్య చేసి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పోలీసులు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

క్లుప్తంగా

రేషన్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని చూపుతున్న అధికారులు

పెనుకొండ రూరల్: అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతపురం వైపు నుంచి కర్ణాటక వైపుగా వెళుతున్న రెండు వాహనాలను కియా పోలీస్ స్టేషన్ సమీపంలో విజిలెన్స్ అధికారులు అడ్డుకుని తనిఖీ చేశారు. ఓ వాహనంలో 30 క్వింటాళ్లు, మరో వాహనంలో 60 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహనాలను సీజ్ చేసి పోలీసులకు అప్పగించినట్లు సీఎస్‌డీటీ ప్రభావతి తెలిపారు.

వివాహిత అదృశ్యం

తలుపుల: మండలంలోని కుర్లి గ్రామానికి చెందిన వివాహిత మౌనిక బుధవారం నుంచి కనపడటం లేదు. తల్లి తులశమ్మ ఫిర్యాదు మేరకు గురువారం పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, వివరాలు వెల్లడించారు. మౌనికకు ఐదేళ్ల క్రితం అనంతపురం జిల్లా పుట్లూరు మండలం ఎ.కొండాపురానికి చెందిన అశోక్‌కుమార్‌తో వివాహమైంది. నెల రోజుల క్రితం పుట్టింటికి వచ్చిన ఆమె బుధవారం మధ్యాహ్నం భర్త వెళుతున్నట్లు అవ్వతో చెప్పి బయలు దేరింది. సాయంత్రమైనా ఎ.కొండాపురం గ్రామానికి ఆమె చేరుకోలేదు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, బంధువులు గాలింపు చేపట్టారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో గురువారం ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ నరసింహుడు తెలిపారు.

సీఐడీ, ఎన్‌డీపీఎస్ కోర్టులను అనంతలోనే కొనసాగించాలి



దీక్షలో పాల్గొన్న న్యాయవాదులు

అనంతపురం: కర్నూలు, తిరుపతికి బదలాయించిన సీఐడీ, ఎన్‌డీపీఎస్ న్యాయస్థానాలను యథతథంగా అనంతపురంలోనే కొనసాగించాలంటూ జిల్లా కోర్టు ఎదురుగా న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 8వ రోజు కొనసాగాయి. ఇందుకు సంబంధించి జారీ చేసిన జీఓలను తక్షణమే రద్దు చేయాలని కూటమి సర్కార్‌ను న్యాయవాదులు డిమాండ్ చేశారు. రిలే దీక్షలో న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు పాల్గొన్నారు. దీక్షకు బహుజన లాయర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బి. నారాయణప్ప, అడ్వైజరీ కమిటీ చైర్మన్.. విశ్రాంత జడ్జి కిష్టప్ప, జిల్లా అధ్యక్షుడు వీవై మూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్వరి, ఉపాధ్యక్షుడు అజీజ్, శ్రీనివాసులు, గంగప్ప, సహాయ కార్యదర్శి రవికుమార్ మద్దతు తెలిపారు. దీక్షలో న్యాయవాదులు నారాయణప్ప, పి.మహేశ్వరి, ఈ.వై.మూర్తి, దేశాయి శ్రీనివాసులు, రవికుమార్, గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

సర్వమత సమ్మేళనం.. బాబయ్య ఉరుసు

సందర్భం : నేడు పెనుకొండలో బాబయ్య గంధం వేడుక

పెనుకొండ: హిందూముస్లింల ఆరాధ్య దైవంగా విరాజిల్లుతున్న పెనుకొండలోని బాబయ్య స్వామి ఉరుసు ఉత్సవాలు ఈ నెల 13న ప్రారంభం కానున్నాయి. స్వామి వారి దర్గాలో రాత్రి పూట బస చేస్తే రోగాలు నయమవుతాయని, ఆ కుటుంబంలో సుఖ శాంతులు నెలకొని సంతోషంగా జీవిస్తారన్నది భక్తుల నమ్మకం. బాబయ్య స్వామి గొప్పతనాన్ని చాటిచెప్పేలా ఏటా బ్రహ్మోత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలోనే శుక్రవారం గంధం వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా నేతృత్వంలో ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే దర్గాను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. శుక్రవారం రాత్రి 10 గంటలకు మొదటి గంధం వేడుకలు పీఠాధిపతి సజ్జద్‌బాబా ఆధ్వర్యంలో ప్రారంభమవుతాయి. అంతకు ముందు సర్వమత సమ్మేళనంలో వివిధ రాష్ట్రాలకు చెందిన మత పెద్దలు పాల్గొని ప్రసంగించనున్నారు. దాదాపు లక్షకు పైగా భక్తులు తరలిరానున్నట్లు అంచనా. అనంతరం 15 రోజుల పాటు ఉరుసు ఉత్సవాలు కొనసాగనున్నాయి.

రాజ్యాన్ని వదిలి..

ఇరాన్‌లోని సీస్తాన్‌కు చెందిన సుల్తాన్ సయ్యద్ హుస్సేన్, సయ్యదా బాబా ఫాతిమా దంపతుల హజరత్ బాబా ఫక్రుద్దీన్ రహమతుల్లాఅలై (బాబయ్య) 12వ శతాబ్దానికి చెందిన వారు. పెనుకొండకు రాకమునుపు సీస్తాన్ రాజ్యానికి రాజుగా ఉండేవారు. రాజుగా ఉంటూ ఓ నిరుపేద కుటుంబానికి న్యాయం చేయలేదన్న ఆవేదన ఆయనను కలచి వేసింది. దీంతో రాజ్యాన్ని వదిలి మక్కా, మదీనా, ఆఫ్ఘనిస్తాన్, కాశ్మీర్, గుజరాత్ తదితర ప్రాంతాల మీదుగా కాలినడకన తిరుచునాపల్లికి చేరుకున్నారు. అక్కడే పీర్‌నాథర్ తల్బే ఆలం బాద్‌షా నతహర్ వలి వద్ద శిష్యుడిగా చేరి ఆధ్యాత్మిక చింతనలో జీవనం సాగించేవారు. ఈ క్రమంలోనే గురువు ఆదేశాల మేరకు తన నివాసాన్ని గుర్తించేందుకు కాలినడకన పెనుకొండకు చేరుకున్నారు. గురువు ఇచ్చిన మిస్వాక్ పుల్ల ఈ ప్రాంతంలో చిగురించడంతో అదే తన నివాసమని గుర్తించి ఇక్కడే ఉంటూ తన దివ్య మహిమలతో భక్తుల మదిలో అవధూతగా చెరగని ముద్ర వేసుకున్నారు. 1295, మే 5న బాబా నిర్యాణం అనంతరం ఇక్కడే మహా సమాధి నిర్మించి నిత్య ప్రార్థనలు సాగిస్తున్నారు.



పెనుకొండలోని బాబయ్య స్వామి దర్గా



బాబయ్య స్వామి సమాధి

మతసామరస్యానికి ప్రతీక



బాబయ్య స్వామి దర్గా మత సామరస్యానికి ప్రతీకగా విరాజిల్లుతోంది. ఉరుసు ఉత్సవాలప్పుడే కాకుండా ప్రతి రోజూ వందలాది మంది హిందువులు, ముస్లింలు, క్రిస్టియన్లు దర్గాను సందర్శిస్తుంటారు. ఇక్కడి స్వామిని భక్తి శ్రద్ధలతో కొలిస్తే వారి కోర్కెలు నెరవేరుతాయి. ఏటా ప్రభుత్వ సహకారంతో ఉరుసు ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తున్నాం.

– తాజ్‌బాబా, దర్గా పీఠాధిపతి, పెనుకొండ

మహిమాన్వితుడు బాబయ్య స్వామి



బాబయ్య స్వామి ఎంతో మహిమాన్వితుడు. ఆయనను నమ్మిన వారి ఇంట సుఖసంతోషాలు వెల్లివిరుస్తాయి. ఇక్కడకు వచ్చిన అన్ని కులాలు, మతాల వారు అన్నదమ్ముల్లా స్నేహభావంతో కలిసిమెలిసి ఉంటారు. బాబయ్య స్వామిపై వారికి ఉన్న భక్తి భావానికి ఇదే నిదర్శనం.

– నేమతుల్లా, పెనుకొండ

పరారీలోనే రిమాండ్ ఖైదీ.. గాలింపులో ప్రత్యేక బృందం

పెనుకొండ: పరారీలో ఉన్న రిమాండ్ ఖైదీ, అడదాకులపల్లికి చెందిన రవీంద్రనాయక్ కోసం ప్రత్యేక బృందాలతో పోలీసులు జల్లెడ పట్టారు. భూ వివాదం కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న రవీంద్రనాయక్‌ను బుధవారం పెనుకొండ న్యాయస్థానంలో హాజరు పరిచేందుకు పోలీసులు పిలుచుకువచ్చారు. ఆ సమయంలో ఎస్కార్ట్ సిబ్బంది అనుమతితో మూత్రవిసర్జనకు వెళ్లి అటు నుంచి పరారైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలో దించి గాలింపు చేపట్టారు. కాగా, రవీంద్రనాయక్ ముంబయి లేదా, హైదరాబాద్ చేరుకుని ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి.

బెంగళూరులో శెట్టూరు వాసి దుర్మరణం



వాహనంలో చిక్కుకున్న లక్ష్మీనారాయణ మృతదేహం

శెట్టూరు: పొట్టకూటి కోసం బెంగళూరు నగరానికి వలస వెళ్లిన వ్యక్తి అక్కడ చోటు చేసుకున్న ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు... శెట్టూరుకు చెందిన బోయ లక్ష్మీనారాయణ(39) మూడేళ్ల క్రితం బతుకు తెరువు కోసం బెంగళూరుకు వెళ్లి ఓ కోళ్ల ఫారంలో డ్రైవర్‌గా పనిలో చేరాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం వైట్‌ఫీల్డ్ వద్ద కోళ్ల లోడ్‌తో వెళుతుండగా ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన టిప్పర్ ఢీ కొంది. దీంతో వాహనంలోనే చిక్కుకుని లక్ష్మీనారాయణ మృతి చెందాడు. మృతునికి భార్య అనిత, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.

మొక్కజొన్న యంత్రంలో పడి వ్యక్తికి గాయాలు

బొమ్మనహాళ్: మొక్కజొన్న యంత్రంలో పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు... బొమ్మనహాళ్ మండలం దర్గాహొన్నూరు గ్రామానికి చెందిన యర్రగుడి వన్నూరు స్వామి బుధవారం అదే గ్రామ శివారులో రైతు వన్నప్పకు చెందిన మొక్కజొన్న పొలంలో పంట నూర్పిడి పనుల్లో పాల్గొన్నాడు. సాయంత్రం యంత్రంపై నిలబడి మొక్కజొన్న కంకులను వేస్తుండగా చైన్‌లింక్ పడి వరిబీజాలు తెగాయి. స్థానిక రైతులు వెంటనే బళ్లారిలోని బిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. కాగా, ప్రమాదం జరిగిన వెంటనే నూర్పిడి యంత్రంతో సహ యజమాని వజ్రకరూరు మండలం గంజికుంటకు చెందిన రాజు పరారయ్యాడు. రాజు అజాగ్రత్త కారణంగానే ప్రమాదం జరిగిందని, ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపాడు.

ప్రాణం బలిగొన్న భూవివాదం

- దాయాదుల చేతిలో యువకుడి దారుణహత్య



హతుడు గంగాధర

రాయదుర్గం: దాయాదులు జరిపిన దాడిలో తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... రాయదుర్గం మండలం చదం గ్రామానికి చెందిన దొణప్ప, చిన్న గంగప్ప, పెద్ద గంగప్ప దాయాదులు. వీరికి భాగపరిష్కారం కింద చెరో మూడు ఎకరాల పొలం వచ్చింది. దీనిని ఎవరికి వారు వారి కుమారులకు పంచారు. అయితే ఓ గట్టు విషయంగా కొంత కాలంగా రెండు కుటుంబాల మధ్య వివాదం నెలకొంది. పొలానికి వెళ్లిన ప్రతి సారీ దీనిపై రెండు కుటుంబాల వారు ఘర్షణ పడేవారు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం దొణప్ప భార్య రుద్రమ్మ తన కుమారుడు గంగాధర్ (26)తో కలసి పొలానికి వెళ్లినప్పుడు పెద్ద, చిన్న గంగప్పల కుమారులు సూరి, వంశి, శివ గొడవకు దిగారు. గంగాధర్‌పై విచక్షణారహితంగా దాడి చేశారు. రుద్రమ్మ కేకలు విని చుట్టుపక్కల రైతులు అక్కడకు చేరుకునేలోపు దాయాదులు పరారయ్యారు. బంధువుల సాయంతో క్షతగాత్రుడిని వెంటనే రాయదుర్గంలోని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బళ్లారిలోని బిమ్స్‌కు వైద్యులు రెఫర్ చేశారు. అక్కడ చికిత్సకు స్పందించక గంగాధర్ బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. విషయం తెలియానే నిందితులు అజ్ఞాతంలోకి వెళ్లారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ జయ నాయక్ తెలిపారు. కాగా, హతుడికి భార్య మల్లీశ్వరి, ఏడాదిలోపు వయసున్న పాప ఉన్నారు. కాగా, గంగాధర్ మృతితో పోలీసులు అప్రమత్తమై గ్రామంలో పికెట్ ఏర్పాటు చేశారు.

ప్రమాదంలో కర్ణాటక మహిళ మృతి



మృతురాలు నాగమణి

ధర్మవరం అర్బన్: స్థానిక కళాజ్యోతి సర్కిల్‌లో గురువారం చోటు చేసుకున్న ప్రమాదంలో కర్ణాటకలోని దొడ్డబళ్లాపురానికి చెందిన వివాహిత నాగమణి (46) మృతి చెందింది. తన భర్త సోమశేఖర్‌తో కలసి శుభ కార్యంలో పాల్గొనేందుకు గురువారం ధర్మవరంలోని ఇందిరమ్మ కాలనీకి వచ్చారు. పనిపై కాలనీ నుంచి టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనంపై తొగట వీధికి వెళుతుండగా కళాజ్యోతి సర్కిల్ మలుపు వద్ద ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వైపు వెళ్లే టిప్పర్ ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన నాగమణి, స్వల్పంగా గాయపడిన సోమశేఖర్‌ను స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఆస్పత్రికి నాగమణిని తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందింది. ఘటనపై వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

తూకాల్లో తేడా రాకూడదు

- స్టాక్ పాయింట్ అధికారులను హెచ్చరించిన ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాపరెడ్డి



గోరంట్లలోని స్టాక్ పాయింట్‌లో బియ్యం బస్తా తూకాలను పరిశీలిస్తున్న విజయప్రతాపరెడ్డి

గోరంట్ల: స్థానిక ఠస్టాక్ పాయింట్‌ను ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాపరెడ్డి గురువారం పరిశీలించారు. స్టాక్ పాయింట్‌లో నిల్వ వివరాలు ఆరా తీశారు. ప్రభుత్వం సరఫరా చేసిన తూకాలకు బియ్యం బస్తాలు సరిగా ఉన్నయా లేదా అని పరిశీలించారు. తూకాల్లో తేడా రాకూడదని అధికారులను హెచ్చరించారు. అనంతరం పాలసముద్రంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు.

పాఠశాలలో తనిఖీ

కదిరి అర్బన్: స్థానిక రాణిపేట మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం విజయప్రతాప్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అనంతరం కాళసముద్రం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. అక్కడ హాస్టల్‌లో విద్యార్థులకు ఇచ్చే కోడిగుడ్డు, అరటి పండు పరిమాణాలను, వంటగది, స్టోర్ రూంలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. అలాగే కాళసముద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారాన్ని పరిశీలించారు. ఆయన వెంట డీఈఓ కిష్టప్ప, డిప్యూటీ తహసీల్దార్ సురేంద్రనాథ్ ఉన్నారు.

పేద విద్యార్థులపై చిన్నచూపు వీడండి..

ఓడీచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులపై చిన్నచూపు వీడాలని ఉపాధ్యాయులు, అధికారులకు విజయప్రతాపరెడ్డి సూచించారు. గురువారం ఓడీ చెరువు మండలం గౌనిపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్‌ను ఆయన తనిఖీ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని కేజీబీవీని సందర్శించారు. సమస్యలపై విద్యార్థులతో ఆరా తీశారు. మండలవ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ సెంటర్లను ఒక్క సూపర్‌వైజర్ మాత్రమే పర్యవేక్షించలేరని, అదనపు సూపర్‌వైజర్‌ను నియమించాలని ఐసీడీఎస్ పీడీ వరలక్ష్మిని ఆదేశించారు.

పీఎంఎస్‌జీపై అవగాహన సదస్సు



సోలార్ ప్యానెల్‌పై అవగాహన కల్పిస్తున్న కంపెనీ ప్రతినిధులు, అధికారులు

పుట్టపర్తి అర్బన్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి సూర్య ఘర్ (పీఎంఎస్‌జీ)పై ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. పుట్టపర్తిలోని సాయి ఆరామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, విద్యుత్ శాఖ డీఈ శివరాం, సత్యసాయి ట్రస్ట్ సోలార్ ప్రాజెక్టు మేనేజర్ రాజేష్, కెనరా బ్యాంకు మేనేజర్ కిషోర్‌కుమార్, ఏడీ శరవణన్, నెడ్ క్యాప్ అధికారి కిషోర్, స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజర్ హరికృష్ణ, పెద్ద సంఖ్యలో పట్టణ వాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోలార్ ప్యానెల్ కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఇంటిపై ఒక కిలోవాట్ విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు అనువైన ప్యానెల్‌ను అమర్చుకునేందుకు రూ. లక్ష వరకూ ఖర్చు అవుతుందని, మూడు కిలోవాట్లకు సుమారు రూ.2 లక్షల నుంచి రూ.2.3 లక్షల వరకూ ఖర్చు అవుతుందన్నారు. ఈ మొత్తానికి బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. ఇక ఒక కిలో వాట్ విద్యుత్ ఉత్పాదనకు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, మూడు కిలో వాట్లకు రూ.78 వేలను సబ్సిడీ కింద ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఈ విధానం వల్ల విద్యుత్ బిల్లులో 75 శాతం తగ్గుదల ఉంటుందన్నారు. అధికంగా ఉత్పత్తి అయ్యే విద్యుత్తును గ్రిడ్‌ల ద్వారా విద్యుత్ శాఖకు తిరిగి అందిస్తే ఒక యూనిట్‌కు రూ.2.90 చొప్పున వారి బ్యాంక్ ఖాతాలోకి జమ అవుతుందన్నారు. ఏడాదిలో 300 రోజులు ఎండ తీవ్రత అధికంగా ఉంటున్న ఈ ప్రాంతంలో సోలార్ విద్యుత్ ఎంతో దోహదపడుతుందన్నారు. ఎండ లేని రోజుల్లో కేవలం వెలుతురుతోనే విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందన్నారు. ఒక కిలో వాట్ విద్యుత్ ఉత్పత్తి చేసే ప్యానెల్‌ను ఏర్పాటు చేసుకుంటే రోజుకు నాలుగు యూనిట్ల చొప్పున విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. ఆసక్తి ఉన్న వారు పీఎం సూర్య ఘర్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ మెంబర్ రఫీ, నాయకులు సామకోటి ఆదినారాయణ, రఫీ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగి ఆత్మహత్య



ఈరేష్ (ఫైల్)

గుంతకల్లు: స్థానిక శాంతినగర్‌లోని రైల్వేక్వాటర్స్‌లో నివాసముంటున్న రైల్వే ఉద్యోగి ఈరేష్ (45) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య నాగలక్ష్మి, ఓ కుమారుడు ఉన్నారు. రైల్వే డీజిల్‌షెడ్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్న ఆయన ఓ మంచి క్రికెటర్ కూడా. కొంతకాలంగా సయాటీకాతో పాటు మైగ్రెయిన్‌తో ఇబ్బంది పడుతున్నాడు. భార్య సైతం ఆస్తమాతో బాధపడుతుండుతోంది. ఈ క్రమంలో వైద్య చికిత్సలు, ఇతర అవసరాలకు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు చేశాడు. ఈ అప్పులకు వడ్డీల భారం పెరిగి రూ.10 లక్షలకు చేరుకుంది. అయినా జబ్బు నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఈరేష్... గురువారం తెల్లవారుజామున ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం నిద్రలేచిన కుటుంబస భ్యులు ఫ్యాన్‌కు విగతజీవిగా వేలాడుతున్న ఈరేష్‌ను చూసి బోరున విలపించారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని, పరిశీలించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బీసీసీఐ టోర్నీలో రాణించిన చక్రిక



అనంతపురం: బీసీసీఐ ఆధ్వర్యంలో జైపూర్‌లోని ఆర్సీఏ అకాడమీ స్టేడియంలో జరుగుతున్న అండర్-15 మహిళల వన్డే టోర్నమెంట్‌లో ఆంధ్ర జట్టు సెమీఫైనల్‌కు చేరింది. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో గుజరాత్‌పై ఆంధ్ర జట్టు విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరింది. ఈ మ్యాచ్‌లో అనంతపురంలోని తపోవనం క్రికెట్ అకాడమీ క్రీడాకారిణి దండు చక్రిక బౌలింగ్‌లో సత్తా చాటింది. 6.5 ఓవర్లలో 22 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంపిక చేసుకున్న ఆంధ్ర జట్టు 30 ఓవర్లలో 187 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన గుజరాత్ జట్టు 31.5 ఓవర్లలో 164 పరుగులకు ఆలౌట్ అయింది.

ఆటో బోల్తా.. వ్యక్తి మృతి

ముదిగుబ్బ: మండలంలోని నల్లచెర్లోపల్లి సమీపంలో గురువారం రాత్రి చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. నల్లచెర్లోపల్లికి చెందిన ఆటో ప్రయాణికులతో ముదిగుబ్బ నుంచి గ్రామానికి బయలుదేరింది. గ్రామ సమీపంలోకి చేరుకోగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన నల్లచెర్లోపల్లికి చెందిన నారాయణ(55) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ఉన్న మరో ఇద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

మడకశిర: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని బేగార్లపల్లికి చెందిన మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి పిలుచుకెళ్లిన యువకుడు రాజుపై పోక్సో కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు, మడకశిర టౌన్ సీఐ రాగిరి రామయ్య తెలిపారు. స్థానిక సీఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వారు వెల్లడించారు. ఈ నెల 5న మైనర్ బాలికను మాయమాటలు చెప్పి రాజు తన వెంట పిలుచుకెళ్లి బెంగళూరు, హిందూపురం ప్రాంతాల్లో తిరిగాడు. బాలిక కనిపించడం లేదంటూ తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ నమోదు చేసిన పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో గురువారం ఉదయం గ్రామ శివారులోకి బాలికతో పాటు రాజు వచ్చినట్లు తెలుసుకుని అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. రాజుపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. కాగా, నిందితుడు వివాహితుడు. పిల్లలు కూడా ఉన్నారు.

పోలీసుల అదుపులో అనుమానితులు

సోమందేపల్లి: కొత్తచెరువు మండలంలో బుధవారం అర్ధరాత్రి హత్యకు గురైన రాజశేఖర్ కేసులో అనుమానితులుగా ఉన్న ముగ్గురిని పుట్టపర్తి పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. గుట్టూరు వద్ద ఉన్న టీస్టాల్ నిర్వాహకుడితో హతుడికి విభేదాలు ఉన్నట్లుగా గుర్తించిన పోలీసులు... దర్యాప్తులో భాగంగా గురువారం సోమందేపల్లికి చేరుకుని అనుమానితులను అదుపులోకి తీసుకుని పుట్టపర్తి పీఎస్‌కు తరలించారు. ఇదే కేసులో ఓ కానిస్టేబుల్ పాత్రపై కూడా విచారణ సాగుతున్నట్లు తెలిసింది.

ఎంసీఏ ఫలితాల విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న జేఎన్‌టీయూఏ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి, మాజీ రిజిస్ట్రార్ శశిధర్

అనంతపురం: జేఎన్‌టీయూఏ ఇంజినీరింగ్ క్యాంపస్ కళాశాలలో నిర్వహించిన ఎంసీఏ రెండో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్-20) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను గురువారం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి విడుదల చేశారు. తక్కువ సమయంలోనే ఫలితాల విడుదలకు డిప్యూటీ కంట్రోలర్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ డి.లలితకుమారి చేసిన కృషిని అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.వసుంధర, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, విభాగాధిపతులు ప్రొఫెసర్ భువన విజయ, ప్రొఫెసర్ టి.బాలనరసయ్య, డాక్టర్ కేఎఫ్ భారతి, డాక్టర్ జి. మమత, పాలకమండలి సభ్యుడు డాక్టర్ ఎం.రామశేఖర్‌రెడ్డి, పీఆర్వో డాక్టర్ బి.ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంప్లాయీస్ సంఘ్ ఘన విజయం



సంబరాల్లో ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు

గుంతకల్లు: రైల్వే కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో గుంతకల్లు డివిజన్‌లో దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ విజయం సాధించింది. స్థానిక రైల్వే వైట్‌హౌస్‌లో గురువారం ఓట్ల లెక్కింపు చేపట్టారు. డివిజన్ వ్యాప్తంగా పోలైన 12,364 ఓట్లలో 113 ఓట్లను ఇన్‌వాల్యూడ్‌గా గుర్తించారు. దాదాపు 10 రౌండ్ల లెక్కింపులో ఎంప్లాయీస్ సంఘ్‌కు 5,966, మజ్దూర్ యూనియన్‌కు 5,723 ఓట్లు దక్కాయి. దీంతో 243 ఓట్ల తేడాతో ఎంప్లాయీస్ సంఘ్ విజయం సాధించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. పోటీలో ఉన్న డీఎంఆర్‌కేఎస్‌కు 372 ఓట్లు, ఐఆర్‌ఎంయూకు 132, ఆర్‌ఎంయూకు 58 ఓట్లు పడ్డాయి. కాగా, చిరకాల ప్రత్యర్థి మజ్దూర్ యూనియన్‌పై విజయం సాధించడంతో ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు విజయోత్సవంలో మునిగితేలారు. రైల్వే ఆస్పత్రి సమీపంలోని సంఘ్ కార్యాలయం వద్దకు నాయకులు, కార్మికులు, ఉద్యోగులు చేరుకుని పెద్దఎత్తున బాణాసంచా పేల్చారు. స్వీట్లు పంపిణీ చేశారు. గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్, అధ్యక్షుడు బాబును సత్కరించారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు కె.మల్లికార్జున, బాలకృష్ణ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్కేటింగ్ పోటీల్లో సత్తా



అనంతపురం: జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో అనంతపురం జిల్లా చిన్నారులు సత్తా చాటారు. మైసూర్‌లో ఈ నెల 5న ప్రారంభమైన పోటీలు 15వ తేదీ వరకూ కొనసాగనున్నాయి. ఇందులో హంజా హుస్సేన్ రజత పతకం, హార్దిక్ రెడ్డి రెండు రజత పకాలు, సుచిత్‌రెడ్డి ఒక రజతం, ఒక కాంస్య పతకం సాధించారు. పతకాలను దక్కించుకున్న చిన్నారులను జిల్లా ఆర్గనైజర్ రవిబాల, చీఫ్ కోచ్ నాగేంద్ర అభినందించారు.